# విలువలు

కల్పన కళ్ళల్లోని కలలు జారిపోయి కన్నీళ్ళు నిండుతున్నాయి. భర్తకోసం సాయంత్రం నుండి ఎదురు తెన్నులు చూస్తూంది. ఇవాళ తమ పెళ్ళిరోజు. ఆఫీసులో పనవగానే ఇంటికి వచ్చేయమని అంది.

''పెళ్ళిరోజా? అయితే ఏంటి? ఓహో! రొమాంటిక్ హీరోయిన్‌వి కదూ?' హేళనగా వికవిక నవ్వుతూ అని వెళ్ళిపోయాడు ఆజాద్.

అతని మాటలు కల్పన చెవుల్లో గింగురుమంటున్నాయి. తను రొమాంటిక్ హీరోయినా? ఐదేళ్లుగా ఇతనిలాంటి మమత, మార్దవం తెలియని యాంత్రిక వ్యక్తితో కాపురం చేసాక కూడా తనలో సున్నిత మైన భావాలు మిగిలున్నాయంటే ఆశ్చర్యమే. నిజానికి ఎన్నెన్ని సుందర స్వప్నాలతో ఇతని జీవితంలో అడుగు పెట్టింది తను! అనురాగంతో, ఆత్మీయతతో తమ దాంపత్యం బంధం పెనవేసుకు పోతుందని, ఒకే ఆదర్శంతో, ఒకే లక్ష్యంతో తమ జీవితం కొనసాగుతుందని

ఎంతగా ఆశపడింది తను! గౌరవంగా, నిరాడంబరంగా జీవించడానికి వీలయినంత సంపాదన వున్న వ్యక్తి సాహచర్యంలో తన బ్రతుకు సాఫీగా సాగిపోతుందని, తను, తన భర్త కలసి తమ జీవితంలోని ప్రతి అంశాన్ని ఆలోచించి, చర్చించి తగు నిర్ణయం తీసుకుంటారని... ఎన్నెన్ని పిచ్చి ఊహలు ఊహించింది!

'అనురాగం, ఆత్మీయత' అనే పదాల అర్థాలు ఇతనికి తెలియవని, ఇతని ఆదర్శాలు, లక్ష్యాలు, తన ఆదర్శాలు, లక్ష్యాలు ఉత్తర దక్షిణ ధృవాలని పెళ్ళయిన సంవత్సరంలోనే తేలిపోయింది. ఇతను తను సవ్యంగా సంపాదించిన దానితో తృప్తి పడడు. ఆడంబరమైన విలాస వస్తువులను సంపాదించిపెట్టగల పైగడ్డి మాత్రమే ఇతనికి సంతృప్తిని, సంతోషాన్ని యివ్వగలవని కూడా తనకు బాగా అర్థమయింది. భార్య భర్త నిర్ణయాన్ని శిరసావహించాల్సిందే తప్ప, కలసి ఆలోచించడం, చర్చించడం, నిర్ణయాలు తీసుకోవడం శుద్ధపొరపాటు విషయాలని ఇతని ప్రగాఢ విశ్వాసం. ఆ విశ్వాసాన్ని తన ఇష్టానికి విరుద్ధంగా తన అభ్యంతరాల్ని కొట్టి పారేస్తూ సంవత్సరానికో బిడ్డ చొప్పున కనడం ద్వారా నిరూపించాడు... తన మృదు భావాల్ని, చిరు కోరికల్ని ఇతను ఎప్పటికప్పుడు చెల్లా చెదురు చేస్తున్నా, పూర్తి జడురాలిగా మారిన తను యింకా అప్పుడప్పుడూ ఇలా ఇతని ప్రవర్తన గురించి ఆశలు పెంచుకుంటూనే వుంది. పెళ్ళిరోజుని తమ జీవితంలో ఒక ప్రత్యేకమైన సమయంగా, ఒక మధురమైన మలుపుకు సంకేతంగా గుర్తించి, తను ప్రొద్దున అన్న మాటలకు పశ్చాత్తాపపడి తను కోరినట్లుగా త్వరగా యింటికి వచ్చేస్తాడని, వస్తూ వస్తూ తనకిష్టమైన మల్లెల్ని తెస్తాడని, రాగానే తనను దగ్గరకు తీసుకుని ప్రేమగా మాట్లాడతాడని...

'ఏయ్' అన్న హుంకరింపుతో కల్పన బెదిరి పోయింది.

గుండెల మీద నిద్రిస్తున్న పసివాడిని, రెండువేపులా కౌగలించుకుని పడుకున్న ఎడ పిల్లల్ని నిద్రాభంగం కలగకుండా పడుకోబెట్టి ఇవతలకు వచ్చేప్పటికి కల్పన తనకు ఎదురొచ్చి సేవలు చెయ్యడం లేదని చిందులు తొక్కుతున్నాడు ఆజాద్.

"రాణీగారు పగటి కలల్లోంచి బయటపడడానికి యింతసేపు పట్టిందన్న మాట" అంకుశంతో పొడుస్తున్నట్లుగా చూచాడు ఆజాద్.

మౌనంగా డైనింగ్ టేబుల్ మీద అన్నీ పెట్టి అతనికి వడ్డిస్తూంది కల్పన. పెళ్ళిరోజని కల్పన ప్రత్యేకంగా తయారుచేసిన వంటకాలన్నింటినీ ఆబగా తింటున్నాడతను... ఒక్క క్షణం తనను ప్రక్కన కూర్చోపెట్టుకుని ప్రేమతో

కొసరికొసరి తినిపిస్తాడని, తను వండినవన్నీ అద్భుతంగా వున్నాయని మెచ్చుకుంటాడని... మళ్ళా అసంభవమైన కల... తన మూర్ఖత్వానికి తనను తిట్టుకుంది కల్పన.

"ఏమిటి నిలువు గుడ్లేసుకుని చూస్తున్నావు? నువ్వూ తిను" ఆజ్ఞాపించాడు ఆజాద్.

"తింటాన్లెండి. తొందరేం ఉంది?" నెమ్మదిగా జవాబిచ్చింది కల్పన.

"నీకంతా తల తిరుగుడు. చెప్పగానే ఎందుకు తింటావు?" బ్రేవ్‌మని తేన్చి యింత వక్కపొడి నోట్లో వేసుకుని కసాబిసా నములుతూ, విదేశీ సంగీతంతో హోరుమనిస్తున్న టేప్ రికార్డర్‌ని తీసుకుని డ్రాయింగ్ రూంలోకి వెళ్లాడు ఆజాద్.

ఇంత ఘనంగా సంపాదించి తెచ్చి పోస్తున్న తన ప్రయోజకత్వాన్ని చూచి మురిసిపోతూ మెచ్చుకోవాల్సింది పోయి తననో పురుగును చూచినట్లు చూస్తోంటే మంటగా వుంది ఆజాద్‌కి. భర్త సంపాందించిన దాన్ని మహదానందంతో అనుభవించాలి తప్ప ఎలా సంపాదిస్తున్నాడనే విషయాన్ని పట్టించుకోగూడదనే ఇంగితం లేదు తన భార్యకు. అందినంత మట్టుకు లాక్కుని లైఫ్‌ని ఎంజాయ్ చెయ్యాల్సింది పోయి నీతి, న్యాయం, నిజాయితీ అంటూ కాకమ్మ కబుర్లు చెప్పే ఈవిడను పెళ్ళి చేసుకోవడం తను జీవితంలో చేసిన పెద్ద తప్పు. తను కొనుక్కొచ్చే వస్తువుల్ని అంటరాని వస్తువులన్నట్లుగా చూసే భార్యమీద కొండంత కసిగా వుంది ఆజాద్‌కి.

డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని ఆలోచిస్తూంది కల్పన. గుండె లోతుల్లోంచి దుఃఖం ఎగసి ఎగసి దూకుతోంది. టేప్ రికార్డర్, టి.వి., ఫ్రిజ్, స్కూటర్, ఇళ్ల స్థలాలు, బిల్డింగ్, కారు వీటిని సేకరించడమే జీవిత లక్ష్యంగా పెట్టుకున్న ఇతని బ్రతుకులో తనిలా వ్యర్థంగా యిమిడి పోవలసిందేనా! తను సేకరిస్తున్న అనేక వస్తువులకిస్తున్న విలువనే భార్యకూ ఇస్తున్న ఇతని ఇంట్లో, తనకు పిచ్చెక్కిస్తున్న ఈ వస్తువుల మధ్య తన నిండు జీవితం బలయి పోవాల్సిందేనా? అవినీతిని, లంచాల్ని జీవితంలోని సహజమైన అంశాలుగా భావిస్తున్న ఇతన్ని అసహ్యించుకుంటూనే ఎందుకు భరించాలి? అసలు తన అయిష్టాన్ని, అసహ్యాన్ని, మౌనంగా ప్రదర్శిస్తూందే తప్ప తీవ్రంగా ఎందుకు ప్రతిఘటించ లేకపోతూంది? ఇతన్ని ధిక్కరించి బ్రతకలేనని భయమా? ఈ ఆలోచనతో ఒక్కసారి ఉలిక్కిపడింది కల్పన. అవును! ఇతనిని ధిక్కరించి బ్రతకలేననే భయంతో కొంత, భార్యాభర్తలు

సర్దుకుపోయి, రాజీపడి, సంసారాన్ని చక్కదిద్దుకోవాలనే భావం నరనరాన జీర్ణించి పోయివుండడం వల్ల కొంత తనితన్ని సహిస్తూంది. .. కానీ రాజీ పడడం వేరు. లొంగిపోవడం వేరు. సర్దుకుపోవడం వేరు, బానిసలాగా బ్రతకడం వేరు అని తెలిసిన తను బ్రతుకు భయంతో ఇతని దుర్లక్షణాల్ని భరిస్తూ బ్రతకడం నీచం, ప్రతిఘటించడం, పోరాడడం గౌరవప్రదమైన విషయమని ఇప్పటికైనా గుర్తించి ప్రవర్తించాలి.

"ఇదిగో, ఎంతసేపు తిండి? వీడియోలో మాంఛి ఫిల్మ్ వేసాను. తొందరగా రా!" బలవంతంగానైనా వీడియోలోని ఫిల్మ్‌ని కల్పన చూచేలా చెయ్యాలని పట్టుదలగా వుంది ఆజాద్‌కి.

ఆలోచనల్లోనుండి బయటపడి ఏమీ తినకుండా అన్నీ సర్ది పెట్టేసి డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చింది కల్పన. అన్ని తలుపులూ మూసేసి వీడియోలో బ్లూఫిల్మ్ వేసి ఆనందంగా చూస్తున్నాడు అజాద్. అతి జుగుప్సాకరంగా వున్న ఆ సినిమా దృశ్యాల్ని, పరమ వికృతంగా కనిపిస్తున్న అతన్ని మార్చి మార్చి చూచిన కల్పన పూనకం పూనిన దానిలా మెరుపు వేగంతో వీడియోను ఆపి, టేప్‌ని బయటకు లాగి, వంటింట్లోకి పరుగెత్తి, గాస్‌స్టవ్ ముట్టించి, టేప్‌ని కాల్చేసింది. నిశ్చేష్టుడై చూస్తున్న ఆజాద్ తెలివి తెచ్చుకునేలోగానే ఇదంతా జరిగిపోయింది. కోపంతో పిచ్చెక్కినట్లు అరుస్తూ కల్పన జుట్టు పట్టుకుని లాగి చెంప మీద బలంగా కొట్టాడు. మళ్ళీ యింకో దెబ్బ వెయ్యబోతున్న అతని చేతిని తోసేసి దూరంగా జరిగింది కల్పన.

"ఆగు, ఇంకొక్క దెబ్బ నా వంటి మీద పడిందంటే మరి మాట దక్కదు... ఇదిగో, ఈ టేప్ ఒక్కటే కాదు, నువ్వు పట్టిన లంచాలతో కొన్న ఈ వస్తువులంటే పరమరోత నాకు... నువ్విప్పటికైనా బుద్ధి తెచ్చుకుని సవ్యంగా బ్రతికితే సరే! లేకపోతే వెనుక ఏ ఆస్థిపాస్తులూ లేని వెయ్యి రూపాయల జీతగాడివి, నీకీ వస్తువులన్నీ ఎలావచ్చాయో తెలుసుకోవలసిన వాళ్ళకు తెలియచెప్తాను. బ్రతుకులో మనుషులకెక్కువ విలువో, డబ్బుకెక్కువ విలువో గుర్తించలేని గుడ్డివాడివి, నీవప్పుడైనా కళ్ళు తెరుస్తావేమో చూస్తాను..." చిరుత కళ్ళల్లా మెరుస్తున్నాయి కల్పన కళ్ళు.

- ఆకాశవాణి, విశాఖపట్టణం, వనిత, 1980